క్లుప్తంగా

బీజేపీ సన్నాహక సమావేశం



అయిజ: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా ఎన్నికల కన్వీనర్ రామచంద్రారెడ్డి మాట్లాడారు. రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీల స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుదన్నారు. జిల్లాలో ప్రతి ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు బీజేపీ తరుపున అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో మండల ఎన్నికల కన్వీనర్ సంజీవరెడ్డి, రాష్ట్ర ఎస్సీ కార్యవర్గ సభ్యుడు మాదన్న, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు భీమసేనరావు, బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సభ్యులందరికీ విత్తనాలు అందజేస్తాం



అయిజ: స్థానిక రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో సభ్యత్వం తీసుకున్న రైతులందరికీ నూరు శాతం సబ్సిడీతో 60 కేజీల వేరుశనగ విత్తనాలు అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో రైతులతో మాట్లాడారు. ఏఈఓలు యాప్‌లో వివరాలు నమోదు చేయకపోవడం వలన పంపిణీ ఆలస్యమవుతుందన్నారు. షెడ్యూల్ ప్రకారం విత్తనాలు అందరికీ పంపిణీ చేస్తామని జనర్దన్ రైతులకు నచ్చజెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు



రాజోళి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వైద్య నిపుణులు గైనకాలజీ, పీడియాట్రిక్, సైకియాట్రి, కంటి వైద్యులు 271 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు క్రాంతి, సయ్యద్‌బాషా, శ్రావణి, వైశాలి, మెడికల్ అధికారి మధుబాబు తదిదరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలి



ఎర్రవల్లి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల స్థాయి స్థానిక సంస్థల ఎన్నికల సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నీలిశ్రీనివాసులు, నాయకులు గొల్ల నర్సింహులు, సోమనాద్రి, నర్సిరెడ్డి, రుక్మందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీ.. ఇద్దరికి గాయాలు



ఉండవెల్లి: ఆటో కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పూర్తి వివరాలు.. మండలంలోని ఇటిక్యాలపాడు శివారు జాతీయ రహదారిపై కర్నూలు నుంచి మానవపాడుకు వెళ్తున్న ఆటోను బెంగుళూరు నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న కారు ఢీ కొట్టడంతో కారు, ఆటో బోల్తా పడింది. కారులో ఉన్న రాకేష్ రెడ్డి భార్య మౌనిక, చిన్నపాపకు గాయాలయ్యాయి. అనంతరం హైవే అంబులెన్స్‌లో చికిత్స అందించారు.

మరమ్మతు మాటే లేదు



అయిజ శివారులో కొట్టుకపోయిన డైవర్షన్ రోడ్డు



అయిజ శివారు వంతెనపై పడిన రంధ్రాన్ని పూడ్చుతున్న పోలీసులు(ఫైల్)

- శిథిలమైన వంతెనలు
- దెబ్బతిన్న పంటలు
- పట్టించుకోని అధికారులు

అయిజ: మండలంలో గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పార్లి రోడ్లు కొట్టుకుపోయియి. వర్షాల ఆగినా అవి సృష్టించిన బీభత్సంతో వంతెనలు శిథిలమైనా, రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది తాత్కాలిక మరమ్మతుతోనే సరిపెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధిక వర్షపాతం

మండలంలో సెప్టెంబర్ నెలలో సాధారణ వర్షపాతం 100 మి.మీ. కురవాల్సి ఉండగా 230 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో పెద్దవాగు, పోలోనివాగు, దేవబండ వాగు, సింధనూరు వాగు, పీతిరి వాగులు పొంగి పొర్లాయి. వర్షాల ప్రభావంతో అంతర్రాష్ట్ర రహదారులు కర్నూలు- రాయచూర్ రోడ్డుతో పాటు అయిజ- ఎమ్మిగనూరు రోడ్లు పూర్తిగా శిథిలమయ్యాయి. అయిజ శివారులోని పెద్దవాగుపై శిథిలమైన వంతెన పైకప్పు రంధ్రాలు పడింది. అయిజ- పులికల్ రోడ్డుపై నిర్మిస్తున్న వంతెన వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు మొత్తం కొట్టుకపోయింది. దీంతో అయిజ- ఎమ్మిగనూరు బస్సులు నిలిపివేశారు. పెద్దవాగుపై వంతెనకు పడిన రంధ్రాలను స్థానిక పోలీసులు దగ్గరుండి తాత్కాలిక మరమ్మతులు చేసినా సరే ప్రయాణికులు భయం భయంగా బ్రిడ్జిని దాటుతున్నారు.

వ్యవసాయం, చేనేత అధిక ప్రభావం

అధిక వర్షాల నేపథ్యంలో వ్యవసాయం, చేనేత పరిశ్రమపై ప్రభావం అధిక ప్రభావం ఉంది. మండల కేంద్రంతో పాటు ఎక్లాస్‌పురంలో చేనేత మగ్గాల్లోకి వర్షం నీరు చేరింది. మగ్గాలు దెబ్బతినడమే కాకుండా, సిద్ధంగా ఉన్న నూలు, బట్టలు నాశనమయ్యానని చేనేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో సుమారు 50 వేల ఎకరాల్లో రైతు సాగు చేపట్టారు. అధిక వర్షాలు పంటలు దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా పత్తి రైతులు నష్టపోతున్నట్లు పేర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు, పాలకులు

మండలంలో భారీ వర్షాల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు చేతులెత్తెయ్యడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన ప్రతిసారి అయిజ- ఎమ్మిగనూరు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోతుందని, అయిజ- పెద్దవాగు వంతనెపై ఉన్న పాతబ్రిడ్జి రంధ్రాలు పడుతున్నా పట్టించుకోవడం లేదంటున్నారు.

అంబులెన్స్ వెళ్లడం లేదు



కర్నూలు- రాయచూర్ రోడ్లు శిథిలమయ్యాయి. పెద్దవాగుపై ఉన్న పాతబ్రిడ్జి వంతెనకు రంధ్రాలు పడ్డాయి. దీంతో అత్యవసర సేవలందించే అంబులెన్స్ వాహనాలు ఆయా గ్రామాలకు చేరుకోలేకపోతున్నాయి. సకాలంలో క్షతగాత్రులకు చికిత్స అందించలేక పోతున్నాం. – శ్రీధర్,108 సిబ్బంది, అయిజ

నివేదిక పంపాం..

మండలంలో అధిక వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కాజ్‌వేలు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు పనులు నిలిపివేశారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. – అల్తాఫ్, ఆర్‌అండ్‌బీ ఏఈ

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి సునంద

మల్దకల్: గర్భిణులు, బాలింతలు పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారం క్రమతప్పకుండా తీసుకుంటనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సంక్షేమ అధికారి సునంద అన్నారు. పోషణ మాసం పురస్కరించుకుని మంగళరం మల్దకల్ హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు రోజువారి ఆహారంలో పాలు, గుడ్లు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకునే విధంగా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు ప్రతిజ్ఞ చేశారు. అలాగే బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ హేమలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాసంతి, సంధ్యారాణి, తెల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, మహేశ్వరమ్మ, వెంకటేశ్వరమ్మ, పుష్పమ్మ, లక్ష్మీరంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం



అయిజలో నివాళులర్పిస్తున్న నాయకులు



మానవపాడులో మాట్లాడుతున్న అధికారులు

మానవపాడు: పౌర హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ఆర్‌ఐ గురురాజ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలంతా సామరస్యంగా కలిసిమెలసి ఉండాలన్నారు. పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తిప్పన్న, పంచాయతీ కార్యదర్శి శంకర్, నాయకులు పరమేష్‌నాయుడు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

అయిజ: పౌరహక్కుల దినం సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద భీమ్ ఆర్మీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రాజు, సామేల్, లక్ష్మణ్, ప్రకాష్, సురేష్, శశివర్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి



శాంతినగర్- రాయచూర్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పరిశీలిస్తున్న నాయకులు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అలంపూర్-రాయచూర్ రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు బీజేపీ నాయకులు అన్నారు. మంగళవారం ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను వారు పరిశీలించి మాట్లాడారు. ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే గుంతలకు మరమ్మతు చేపట్టాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, నాయకులు వెంకటేశ్వర్లు, సంజన్నగౌడ్, మోహన్, శేఖర్, పరుశరాముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్థానిక ఎన్నికలపై సమావేశం

ఇటిక్యాల: స్థానిక ఎన్నికలపై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో ఎన్నికలకు సంబంధించిన మోడల్ కోడ్ కండక్ట్ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అలంపూర్‌లో ఎమ్మెల్యే పూజలు



అలంపూర్: అలంపూర్ క్షేత్ర ఆలయాలను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదర్‌రెడ్డి కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు అర్చకులతో కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు శేష వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు అద్దాకుల రాము, నరసింహ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

అలంపూర్ క్షేత్ర ఆలయాలను ఎమ్మెల్యే విజయుడు చల్లా అగస్త్యరెడ్డితో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. అర్చక స్వాములు వారిని శేషవస్త్రాలతో సత్కరించారు. తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. వీరితోపాటు మాజీ ఎంపీపీ అశోక్‌రెడ్డి, నాయకులు రఘురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండుగ వేళ ప్రత్యేక రైళ్ల హాల్ట్



ఉండవెల్లి: మండలంలోని జోగుళాంబ రైల్వే హాల్ట్‌లో దసరా ఉత్సవాల సందర్భంగా రెండు ప్రత్యేక రైళ్లు అక్టోబర్ 1న ఆగుతాయని రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల కోసం చెంగల్‌పట్టు నుంచి కాచిగూడకు వెళ్లే రైలు, మురుడేశ్వర్ రైలు ఆగునున్నట్లు పేర్కొన్నారు.

ఆలయ భూములు కాపాడాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు

ధరూరు: మండల పరిధిలోని నీలహళ్లిలో ఆక్రమణకు గురవుతున్న శ్రీఆంజనేయస్వామి ఆలయ భూములను కాపాడాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ్లళ్ల రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో మండల నాయకులు గద్వాల కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణను కలిసి ఆక్రమణ గురించి వివరించారు. సర్వే నంబర్ 355లో 5 ఎకరాల 16 గుంటల భూమిని కొందరు గ్రామ నాయకులు కబ్జా చేసి ప్లాట్లుగా చేస్తున్నారన్నారు. ఈ వ్యవహారంపై స్పందించి తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రాములు, మండల అధ్యక్షుడు గోవిందు, మెనెప్ప, మీసాల కిష్టన్న, భూపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బతుకమ్మ సంబరాలు



గద్వాల మండలం పూడూర్‌లో బతుకమ్మ వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: చిత్తూ..చిత్తూల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మా.. బంగారు బొమ్మ.. దొరికెనమ్మ ఈ వాడలోన.. అంటూ మహిళలు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ బతుకమ్మ పండగను జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా నిర్వహించారు. గద్వాల మండలం పూడూర్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి కోలాటం ఆడారు. వార్డులోని హమాలీ కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. అయిజ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు, మున్సిపల్ సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఆయా కార్యాలయాల్లో బతుకమ్మను ఆటపాటలతో వైభవంగా నిర్వహించారు.




ధరూరులో బతుకమ్మలతో ఊరేగింపు చేస్తున్న మహిళలు






ధరూరు వైఎస్సార్ చౌరస్తాలో.., ఉండవెల్లిలో బతుకమ్మ ఆడుతున్న ఐద్వా సభ్యులు



అలంపూర్‌లో దుర్గామాతగా కన్యకాపరమేశ్వరి



ఉండవెల్లి అంబేడ్కర్ కాలనీలో..



ప్రాగటూరులో దుర్గమ్మ అవతారంలో..



బీచుపల్లిలో నిజరూప అవతారంలో దుర్గామాత



ధరూరు కాళికాదేవి ఆలయంలో..

కరుణించు.. కనకదుర్గా



శాంతినగర్‌లో సామూహిక కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు



బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవాత్రి ఉత్సవాల్లో మంగళవారం దుర్గాష్టమిని పురస్కరించుకొని దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

■ అలంపూర్ పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గామాతగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో వేడుకలకు హాజరయ్యారు.

■ శాంతినగర్‌లోని కోయిల్‌దిన్నె రోడ్డు సమీపంలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, హోమాలు, కుంకుమార్చన పూజలు జరిపించారు. కన్యకపూజ, చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

■ దరూరు మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో కోట యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో ప్రత్యేక పూజలందుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

■ అయిజ మండల కేంద్రంలోని వివిధ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరి, కాళికాదేవి ఆలయాల్లో అభిషేకాలు చేశారు.

■ మల్దకల్ మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, మార్కండేయస్వామి ఆలయం, బూడిదపాడు, బిజ్వారం, నాగర్‌దొడ్డి, ఎల్కూరు గ్రామాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

■ శాంతినగర్‌లోని సబ్ స్టేషన్‌లో ఆయుధ పూజ కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ సిబ్బంది భక్తి శ్రద్ధలతో జరిపించారు. దుర్గామాతకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఏడీ నవీన్‌కుమార్, ఏఈ సుబ్బారాయుడు, నాగరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, రాముడు, రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

■ ఇటిక్యాల మండల పరిధిలోని పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయం, మునగాల, చాగాపురం భవానీయూత్, షాబాద్ శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

■ ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో దుర్గామాత నిజరూప అవతారం, కోదండరామస్వామి ఆలయంలో జ్ఞాన సరస్వతీదేవి వీరలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

■ ఉండవెల్లి, మండలంలోని ప్రాగటూరులో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కనకదుర్గమ్మ అమ్మవారి అలంకరణలో దర్శనమిచ్చారు.



మునగాలలో..





శాంతినగర్‌లో.., శాంతినగర్ సబ్ స్టేషన్‌లో పూజలు చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు